**88**

**ధారావాహిక**



# జాయ సేనాపతి


మత్తి భానుమూర్తి

99893 71284


చారిత్రక కాల్పనిక నవల

**జరిగిన కథ :**

**ఓ సాధారణ పౌరుడిగా వెలనాడు వీధుల్లో తిరుగుతున్న జాయపునికి.. పరాశరదాసు అనే గేయ కవి కలిశాడు. అయితే, అతనికి తన పేరు 'జగన్నాథుడు' అనీ, తనో నాట్యాచార్యుడిననీ అబద్ధం చెప్పాడు జాయపుడు. ఇద్దరికీ మంచి మైత్రి కుదిరింది. ఇద్దరూ కలిసి పెద్దనార్య అనే మరో మిత్రుని ఇంటికి వెళ్లి.. అక్కడ జరిగే సాహిత్య చర్చల్లో పాల్గొంటున్నారు. ఆ రోజున పాతిక ముప్పైమంది కవి పండితులు అక్కడ సమావేశమయ్యారు. 'తెలుగు భాష'పైన చర్చోపచర్చలు సాగిస్తున్నారు.**

''దేశీ (జనుల భాష) అయినా, మార్గి (శిష్ట భాష) అయినా.. కొంత సంస్కరించి గ్రంథస్తం చేసుకోవాలి. అర్థం కాలేదా!? మీరు నాట్యకారులు కదా.. ఓ పాత్ర ఓ సంభాషణ చెప్పాలి. ఓ అగసాలిని 'నా కత్తి పని ఎంతవరకు వచ్చింది?' అని రైతు అడిగితే ఎవంటాడు?! 'కత్తా.. గిత్తా.. అమాస దాటాక కనబడు!' అంటాడు. కానీ, అదే సంభాషణ నాట్యరచనలో పెడితే ఏమని రాస్తారు?! 'అయ్యయ్యో.. నీకత్తి మొనగాడి కత్తి. దానికి పదును పెట్టుటయన్నది ఎంత జాగరూకతతో చేయవలెను!? అందువల్ల మరొక మాసము.. అమావాస్య వెళ్లిన పిదప విచ్చేయవలసినదిగా మనవి!' అని రాస్తాం. లేదా పద్య రూపంలో చెబుతాం. అవునా.. అదే సంస్కరించడం అంటే!'' వివరించాడు ఓ కవి మిత్రుడు.

''అబ్బబ్బ! సంస్కరించడం.. సంస్కరించడం! ఇక ఆపి ఇదిగో ఈ సల్లచారు.. చల్లగా ఉన్నాయి. గొంతులో పోసుకోండి..'' అంటూ వచ్చింది పెద్దనార్యుని భార్య, వింజమాంబ పరిచారికతో.

అందరూ భళ్లున నవ్వడంతో ఆ ప్రసక్తి అక్కడితో ఆగిపోయింది.

అందరూ గృహాలవద్ద తీక్షణమైన ఏకాగ్రతతో గ్రంథ పఠనం, కావ్యరచన సాగిస్తున్నా ఇక్కడ మిత్ర పండితుల సాహచర్యంలో కాలక్షేపంగా, చలోక్తులతో గడుపుతారు. తెలుగు సంస్కృతాలలో స్వతంత్ర రచనలు, అనువాదాలు చేసేవారు మాత్రమే కాదు.. రాజలేఖకులు, శాసనాల రచయితలు కూడా ఉన్నారిందులో.

ఇక్కడి రాజాస్థానాలకు, వణిజ శ్రేణులకు మాత్రమేకాకుండా.. వేరువేరు రాజ్యాల సభలకు వెళ్లడం, అక్కడి పండితులతో చర్చలు, సన్మానాలు, మడిమాన్యాలు పొందడం.. ఎప్పుడూ తిరుగుతూనే ఉంటారు. ఆయా రాజ్యాలవారి గౌరవాభిమానాలు పెరిగిపోతే అక్కడే స్థిర పడతారు. దక్షిణావర్తం, ఆర్యావర్తం అంతా వెలనాడు పండితులు, నాట్యకారులు అంటే వెలలేని పేరు ప్రఖ్యాతులున్నాయి. వెలనాడులోకి నిరాసక్తంగా ప్రవేశించిన జాయపుడు.. ఇప్పుడు ఈ పెద్దన కళాగృహంలో కాస్త సాంత్వన పొందుతున్నాడు.

* * *